# అడివి మల్లె

లేడిలా చెంగున ఇంట్లోకి పరిగెత్తుకుంటూ వచ్చింది కమల పట్టరానంత సంతోషంతో. అవును మరి ఆ వయస్సు కదే ఘనవిజయం. పదహారేళ్లు నిండిన కమల "అమ్మా" అని కేక వేసి తల్లిని కౌగలించుకొని చెప్పింది తను స్కూలుఫైనలు ప్యాసయ్యానని. "పేపర్లో వేశారుటే..." అని అమ్మ అడుగుతున్న దేమిటో వినిపించుకోకుండా "నాన్నేరి?" అన్నది. నాన్నతో యీ సంగతి చెబితే పొంగిపోడూ?

మర్నాడు నూరురూపాయల ఉద్యోగంనుంచి రిటైర్ కాబోతున్న నాన్న పెరట్లో మల్లెపాదులకు నీళ్ళు కొడుతున్నాడు. యావజ్జీవితం ఏదో సాధిద్దామనుకుంటూనే చుట్ట ముక్కలా కాల్చేశాడు. అసలు ఏమి సాధించదలచుకున్నదీ తనకే స్పష్టంగా అంతుబట్టడం లేదు. విరియబూసింది మల్లె పొద. అదిమటుకేం సాధించింది. సిగల్లో తురుముకోడానికి ఆడంగులకు పూలు పూసి యిచ్చింది. తనూ అంతే. కుటుంబంలో నలుగురికోసం నౌఖరీలో చేరి వాళ్ళ ఆనందం కోసమే ఇంతకాలం యా చక్రాన్ని తిప్పుకొచ్చాడు. ఎంతమంది వచ్చి పువ్వులు తెంపుకుపోతున్నా అది పూయడం మానదు. విరియ బూసిన మల్లె పొదవంక కన్నార్పకుండా చూస్తున్నాడు.

పెరట్లోకి రివ్వున రెండంగలలో వచ్చింది కమల. మనస్సు సంగీతం పాడుతూంది. నూతి దగ్గర కొబ్బరి చెట్టు మీద నెలవంక కనిపించింది. కళ్లు మూసుకుని తులసికోట ముందర నిల్చుని కళ్లువిప్పి మొక్కుకుంది.

తండ్రిదగ్గరకొచ్చి "నాన్నా, నాన్నా" అని పిలిచింది.

"ఏమిటమ్మా"

"పరీక్ష ప్యాసయ్యాను నాన్నా..."

"అలాగా. సరేకాని అలా పరిగెత్తడ మెందుకు? పరికిణీ కాళ్ళలో పడి క్రిందపడి పోతావు."

తను చెప్పిన శుభవార్తపట్ల నాన్న చూపిన ఔదాసీన్యం ఆమె ఉత్సాహానికి అడ్డుతగిలింది.

"ఫస్టుగా ప్యాసయ్యాను నాన్నా..."

"అవునమ్మా నువ్వు ప్యాసవకపోతే మరెవరు అవుతారు?" అంటూ ఆయన ఆ పాదు దగ్గరనుంచి లేచి ఇంట్లోకి వేళ్ళేడు. చుట్ట కాల్చుకోడానికని ఒకటి రెండు పుల్లలు గీశాడేకాని అంటించుకోలేదు.

వాకిట్లోకి వచ్చి మంచం వాల్చి కూర్చున్నాడు. తను రిటైరై యిక రేపటినుంచీ చేసేదేమిటి? కొడుకు రెండేళ్ళబట్టీ ఇంటర్ తప్పుతున్నాడు. కూతురు పరీక్ష ప్యాసయింది. ఏం చెయ్యడం?

"ఇంకా చదువుతాను నాన్నా" అన్నది కమల.

"ఎందుకమ్మా పెద్ద చదువులు, ఉద్యోగాలు చెయ్యాలి గనుకనా?"

కమల ముఖం చిన్నబోయింది. వెల వెల బోతూ తల్లి దగ్గర కెళ్ళింది.

"పోనీ చదివించరాదుటండీ, దానికి వయస్సే మంత మించిపోయిందనీ" అన్నది తల్లి.

సరిగ్గా అందుకనే తను మరి యిక చదివించ కూడ

దంటున్నాడు. చిన్నతనంలోనే ఏదో తగిన సంబంధం చూసి ముడిపెడితే సరిపోతుంది. చదువులో పడితే పెళ్ళి వెనకబడుతుంది. పెద్ద చదువులు చదివిస్తే అంతకన్న పెద్ద చదువులు చదివిన వాణ్ణి వెతుక్కురావాలి. వయస్సు వచ్చేకొద్దీ చదువులు, చదువుల కొద్ది కట్నాలు ఎత్తుకెత్తు పొయ్యాలి. అందుకనే ఆయన "చదువు వద్దు మరి వద్దు" అన్నాడు నిశ్చితంగా.

ఆకాశమెత్తున లేచిన కెరటం చివాలున కిందికి తుంపర తుంపరలుగా విరిగిపడ్డట్టుయిందికమలమనస్సు. ఫిజిక్సు గ్రూపుతో బి. యస్‌సి, వరకూ చదవాలని వున్నది. అన్నయ్య ఫిజిక్సులో ఎందుకు తప్పేడో? అంత ఇంటరెస్టింగ్ సబ్జక్టు వాడికి ఎందుకు తలకెక్కలేదో బోధపడ్డం లేదు.

చదివించనంటున్నాడు నాన్న... ఆయనకు నచ్చచెప్పడమెలాగ? అమ్మ చెప్పినా వినడు. పెళ్లి పెళ్ళంటాడు. పెళ్ళి లేకపోతేనేం, సుశీలమ్మగారిలా చక్కగా ఎమ్. ఏ చదువుకుని హాయిగా ఏ హెడ్‌మిస్ట్రిస్ ఉద్యోగమో చేసుకోకూడదూ? అవును, ఆవిడ చెబితే వింటాడేమోనాన్న తనంటే ఆవిడకెంతో సరదా. ఇంత మంచి మార్కులతో ప్యాసయి యిప్పుడు చదువుమానేస్తానంటే ఆవిడవొప్పుకోదు. నాన్నతో చెప్పి కాలేజీలో చేర్పిస్తుంది. ఆవిడ మాటంటే నాన్నకి గురే.

♦ ♦ ♦ ♦

సుశీలమ్మ అద్దంముందర కూర్చుని తలదువ్వుకుంటున్నది. ఒంటరి జీవితంలో కాలక్షేపానికి అద్దమే అండ. తన గురించి యితరులు చెప్పని, చెప్పలేని నిజాన్ని యీ అద్దమే చెబుతుంది.

తన చక్కదనాన్ని చూసి ముచ్చటగా 'చంపకు చారడేసి కళ్ళనీ, కళ్ళతో మొదలుపెట్టి నున్నటి బుగ్గమీద చిన్న మచ్చనూ, వొంకు వొంకుల జుట్టునూ వర్ణించి మెత్తగా నిమిరినట్టయింది... తన ముఖాన్ని ఆప్యాయంగా చూసుకుని సిగ్గు పడింది.

తనుచక్కగా లేకపోతేవొచ్చిన నష్టమేమిటి? ఏభయ్యో పడిలో పడబోతున్నతను ఎలావుంటే నేమిటి? దువ్వెనపంటిలో చిక్కుపడ్డ వెండిజీరలు రానున్న వార్థక్యానికి చిహ్నాలు. సిగ చుట్టి పౌడర్ వేసుకుంటూనే 'యీ స్నోలూ, పౌడర్లూ ఏం రక్షరేకులా' అనుకుంటూ తనలో తనే నవ్వుకున్నది.

కిటికీ దగ్గర ఏదో అడుగుల చప్పుడైనట్లు వినిపించి భయపడింది. మెల్లగా లేచి కిటికీ దగ్గరకెళ్ళి చూసింది. పెంకి వెధవ లెవరైనా కిటికీలోంచి తొంగిచూడడం లేదుకదా. 'ఎవ్వరూ లేరు, బతికేను...' అనుకొన్నది.

అయినా భయమెందుకు? తనేం చేసింది గనక?

దూరాన రోడ్డుమీద ఎవరో కాలేజీకుర్రాళ్ళు పోతున్నారు. వాళ్ళంటే తనకు పరమ అసహ్యం. విద్యలో శ్రద్ధ, పటుదల, ఏకాగ్రత లేకపోవడం వల్ల, యిప్పటినుంచే చెడు బుద్ధులు పుడుతూవు టాయి వీళ్ళకి. ఇరవై ఏళ్ళన్నా నిండని కుర్రాళ్ళకు సినిమాల షోకులమీద, ఆడవాళ్ళమీద పోతున్నది మనసు. అందుకనే అసలు అక్షరాభ్యాసానికన్నా ముందర నిరాడంబరత, శ్రద్ధాసక్తులు మప్పి జాగ్రతపడాలంటుందితను. జిలా కలక్టరుగారబ్బాయి సూటువేసుకుని కారుమీదొస్తాడు, విచ్చలవిడిగా డబ్బు ఖర్చు పెడతాడు. ఇలాంటి పిల్లలూ,

వాళ్ళ స్నేహితులూ చదువులు వెనక్కి పెట్టి తమ కన్నిటికీ లైసెన్సు వున్నదనుకుంటారు.

అయితే బుద్ధొచ్చిన పెద్దవాళ్ళలోకూడా ఆడవాళ్ళు కనిపిస్తే కళ్లు చిట్లించి, ఈలలు వేసే వాళ్లున్నారు. అందుకే వాళ్ళెవరిని చూసినా తనకు రోత పుడుతుంది. ఈ జుగుప్సా భావాన్ని తను వాళ్ళముందు దాచుకోదుకూడాను... ఒట్టి చవట వెధవలు... రోడ్డుప్రక్కనున్న మామిడిచెట్టు కాయలు కొట్టుకుంటే ఎవరూ అడిగేవాళ్ళుండరని అనుకుంటారు, కాని చుట్టూ ముళ్ళకంచె వున్నదని తెలీదు కాబోలు.

కిటికీ మూసివేసింది. ఎవరో తలుపు కొడుతున్నారు. ఎవరైవుంటారో? ఛ! అన్నిటికీ సంశయమే. అన్నిటికీ భయమే. తనకే తనకీ బ్లడ్ ప్రెషర్.

తలుపు తీసింది. కమల లోపలికి వచ్చింది.

"అమ్మగారూ, ఇవాళ క్లబ్బుకు వెళ్ళలేదా?"

"క్లబ్బుకా? అవును మరచిపోయాను. ఏదో అలా కూరుచుండిపోయాను." లేడీస్ క్లబ్బుకు వెళ్ళడానికే తనిందాక తలదువ్వుకుని తయారైందని మరచిపోయింది.

ఆమెకు కమలను చూస్తే అసూయకలిగింది. కమల చక్కటి చుక్క.. కళ్ళల్లో అవయవాల్లో యవ్వనం తొంగి చూస్తున్నది. జుట్టుకు నూనె రాచుకోలేదు. వదులుగా వేసుకున్న జడ కొత్త అందం తెచ్చిపెట్టింది. "ఎవడు చేసుకుంటాడో అదృష్టవంతుడు" అనుకున్నది సుశీలమ్మ.

"నూనె రాచుకోలేదేం కమలా జుట్టుకి?"

"తలంటింది మా అమ్మ. సాయంకాలం రాసుకోవడం మరచిపోయాను. ఏం?"

"అబ్బే, ఏమీ లేదు."

"మా నాన్న మరి చదివించ నంటున్నాడండీ. నా కేదో బెంగగా వుంది" అన్నది కమల

"ఏం, ఎందుకు చదివించనంటారు?"

"ఇంట్లో కూచోబెట్టి పెళ్ళి చేస్తారట. ఇదేం న్యాయం మీరే చెప్పండి అమ్మగారూ. నాకు ఇంటర్‌లో చేరి, ఫిజిక్సుతో బి. ఎస్‌సి. వరకూ చదవాలనివుంది. నా మాట ఎవరు వింటారు? చదువు మానెయ్యాలంటే నా కేడుపొస్తున్నది. నాన్నకు నచ్చజెప్పడమెలాగ? అమ్మ చెబితే వినరు. అమ్మ గారూ! మీరు వచ్చి మా నాన్నకు కాస్త నచ్చచెప్పరూ..." కమల కళ్ళలో నీళ్లు తిరిగాయి.

"ఏమిటీ! ఇప్పటినుంచి పెళ్ళా!"

"అవును, వయస్సుఎక్కువైతే పెళ్ళికావడం కష్టమంట. పోనీ కాకపోతే ఏంపోయింది చెప్పండి.''

సుశీలమ్మ గుండె గతుక్కుమన్నది. "కాకపోతే ఏం పోయింది? కాకపోతే అంతా పోయినట్టే వుంటుంది. చిన్న తనంలో ఏం తెలుస్తుంది! తనకి అలాగే అయింది. తరువాత ఎం. ఏ. చదివి ఉద్యోగంలో చేరింది. కాలక్షేపానికి లోటు లేకపోయినా, జీవితం హాయిగావున్నట్టే అనిపించినా వయస్సు వచ్చినకొద్దీ జీవితం కొవ్వొత్తిలాగా వృధాగా ఖర్చయి పోతున్నట్టూ, పొంగి ప్రవహించేనది నిరుపయోగంగా సముద్రంలో పడుతున్నట్టూ, అడవి మల్లెలు గుత్తులుగుత్తులుగా

నేలరాలి ఎండకు ఎండి గాలికి ఎగిరిపోతున్నట్టూ అనిపించేది. ఏవో తెలియని ఊహలతో, ఎవరిని చూసినా ద్వేషంతో చిరాకుతో, తనకేమి కావాలో, ఏం చెయ్యాలో తెలియక శూన్యంగా మబ్బులులేని ఆకాశంలా భయం భయంగా వుంటూంది. బంగారపు బొమ్మలాంటి కమలకూడా అడవి మల్లె అయిపోదుకదా!

"ఏమంటారు అమ్మగారూ, ఏం చెయ్యమంటారు? మీరే చెప్పండి."

"మీ నాన్నగారు చెప్పింది నిజమేనమ్మా! తప్పకుండా పెళ్ళిచేసుకో."

కమల ఆశ్చర్యపోయింది. పెళ్ళిచేసుకోకుండా, పెద్ద చదువు చదివి ఉద్యోగం చేస్తూ హాయిగావున్న అమ్మగారు యిలా అంటుందేమిటి! సంసారమనే బందిఖానా లేకపోవడం వల్ల ఆమె ఎంతో స్వేచ్ఛగా వుంటూంది. ఇంటిదగ్గర బీదపిల్లలను చేరదీసి ఆదరిస్తుంది. కొందరికిబడి జీతాలుకూడా తనే కడుతుంది, ఊళ్లో అమ్మగారంటే అందరికీ ఎంతో గౌరవం. బాగా చదివే పిల్లల ఇళ్ళకువెళ్ళి వాళ్ళ తల్లితండ్రులకు సలహాలిచ్చి ఎంతో ప్రోత్సహిస్తూండే యిలాంటి సుశీలమ్మగారు తనకు యిచ్చే సలహా ఇదా? అమ్మగారికి ఏళ్ళొచ్చి చాదస్తం వస్తూన్నట్టున్నది. తనకిక ఎవరు సాయపడగలరు?

సుశీలమ్మ మనసు ఒక్కమాటు కలచి నట్లుగా. దట్టమైన పొగ చుట్టూ కమ్మకుని ఉక్కిరి బిక్కిరి అయినట్లుగా వుంది. తను ఏమన్నదో, ఎవరికి ఎలాంటి సలహా యిస్తున్నదో అది మంచిదో చెడ్డదో ఏమీ నిర్ణయించుకోలేకపోయింది

కమల 'వస్తానండీ' అని మెల్లగా తలుపు తీసుకుని, వరండాలోంచి అవతలికి వెళ్ళి పోయింది. సుశీలమ్మ చటుక్కున లేచివెళ్ళి పోతున్న కమలను పిలిచి, లోపలకుతీసుకు వచ్చింది.

"కమలా, కోపమొచ్చిందా?"

కమల మాట్లాడ లేదు కళ్ళలో నీళ్ళుమాత్రం వున్నాయి. సుశీలమ్మ చీరకొంగుతో కమల కళ్ళు తుడిచింది.

"చదువుకో అమ్మా, తప్పక చదువుకో. నాన్నగారితో నే చెబుతాలే"

"నాకు పెళ్ళి చెయ్యొద్దని చెప్పండి అమ్మగారూ."

"పిచ్చిపిల్లా భయపడకు. మన్మథుడు లాంటి అల్లుణ్ణి నేనే తెస్తానని నాన్నగారితో చెప్పు" అని నవ్వింది సుశీలమ్మ.

"ఛీ, నాకసలు పెళ్ళొద్దు" అంటూ కమల సుశీలమ్మను గట్టిగా కౌగలించుకున్నది. సుశీలమ్మ కళ్ళు చెమ్మగిలి ఎక్కడో దాగి వున్న మాతృత్వం ఒక్కసారి తొంగిచూచినట్లయింది.